

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, సెప్టెంబరు 3: 2024-25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో వివిధ కోర్సులలో విద్యనభ్యసిస్తున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులు పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాలఅభివృద్ధి అధికారి మల్లేశం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. హెచ్‌టీటీపీ//తెలంగాణపాస్.సీజీజీ.జీవోవీ.ఐఎన్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హైదరాబాద్ మహానగరాన్ని మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలిదశలో చేపట్టిన పురపాలికల్లో శివారు గ్రామాల విలీన పక్రియకు రాజముద్ర లభించింది. అయితే గతంలో ప్రకటించిన జాబితాలో మార్పులు చేర్పులు చేశారు. శివారు మున్సిపాలిటీల్లో సమీప 51 గ్రామాలను విలీనం చేస్తూ ప్రభుత్వం తాజాగా గెజిట్ విడుదల చేసింది. దీని ప్రకారం మేడ్చల్ జిల్లాకు చెందిన అధిక పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం అవుతున్నాయి. ఇదిలా ఉంటే తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మేడ్చల్ జిల్లా దాదాపు పూర్తిగా పట్టణ ప్రాంతంగా మారనుంది. జిల్లాలో పట్టణ ప్రాంతం 95శాతానికిపైగా పెరగనుంది. అయితే, పక్కన ఉన్న జిల్లాల నుంచి కొన్ని గ్రామాలను మేడ్చల్ జిల్లాలో కలిపే అవకాశం ఉన్నట్లు కొంతకాలంగా ప్రచారం సాగుతోంది.



సిటీకి 51 గ్రామాలు

- నగర శివారులోని పల్లెలు పురపాలికల్లో విలీనం
- మేడ్చల్ జిల్లా పరిధిలోనే 28 గ్రామాలు
- జిల్లాలో మిగిలింది 31 పంచాయతీలు మాత్రమే
- భారీగా తగ్గనున్న పంచాయతీల సంఖ్య
- స్వల్ప మార్పులతో గెజిట్ విడుదల
- మీర్జాపూర్ గ్రామం శంకర్‌పల్లికి బదులు నార్సింగ్‌లో విలీనం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/ మేడ్చల్ జిల్లా ప్రతినిధి)

ఔటర్ రింగు రోడ్డుకు అనుకుని ఉన్న గ్రామాలను ముందుగా సమీపపురపాలికల్లో విలీనం చేసి ఆ తరువాత గ్రేటర్‌లో కలిపేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టిన విషయం తెలిసిందే. దీనిపై కేబినెట్ సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. తొలుత ఔటర్‌కు అనుకుని ఉన్న 45 గ్రామ పంచాయతీలను శివారు మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని నిర్ణయించినప్పటికీ మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలోని కేబినెట్ సబ్ కమిటీ కొన్ని మార్పులు చేసి విలీన గ్రామాల సంఖ్యను 51కి పెంచింది. మేడ్చల్ జిల్లాలో అత్యధిక గ్రామాలు పురపాలికల్లో విలీనమవుతున్నాయి. మేడ్చల్ జిల్లాలో మొత్తం 28 గ్రామాలు ఏడు పురపాలికల్లో విలీనం చేస్తున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలోని నాలుగు పురపాలికల్లో 12 గ్రామాలను విలీనం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో రెండు పురపాలికల్లో 11 గ్రామాలు విలీనం కానున్నాయి. రంగారెడ్డి జిల్లా, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఈ గ్రామాలన్నీ కూడా ఔటర్ రింగు రోడ్డుకు ఇరువైపుల అనుకున్న గ్రామాలే. శివారు గ్రామాలు ప్రస్తుతం పురపాలికల్లో విలీనమైన ఏడాదిలోగానే వీటన్నింటినీ గ్రేటర్‌లో కలపనున్నారు. ఇదిలా ఉంటే తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మేడ్చల్ జిల్లా దాదాపు పూర్తిగా పట్టణ ప్రాంతంగా మారనుంది. దీంతో మేడ్చల్ జిల్లాలో పట్టణ ప్రాంతం 95శాతానికిపైగా పెరగనుంది. మేడ్చల్‌లో ప్రస్తుతం 61 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 28 గ్రామపంచాయతీలను పురపాలికల్లో కలుపుతున్నారు. ఇక, జిల్లాలో మిగిలే గ్రామ పంచాయతీలు 31 మాత్రమే. భవిష్యత్తులో వీటిని ఏం చేస్తారు? వీటికోసం మండల పరిషత్‌లు ఉంచుతారా?. జిల్లా పరిషత్ ఉంటుందా?. అనేది తెలియడం లేదు. పక్కన ఉన్న జిల్లాల నుంచి కొన్ని గ్రామాలను మేడ్చల్ జిల్లాలో కలిపే అవకాశం ఉన్నట్లు కొంత కాలంగా ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉంటే శివార్లలో గతంలో పేర్కొన్న విలీన గ్రామాలు 45 నుంచి 51కి పెరిగాయి. ఇందులో మేడ్చల్ జిల్లాలో అయిదు పెరగగా, రంగారెడ్డి జిల్లాలో ఒకటి పెరిగింది. రంగారెడ్డి జిల్లాలో శంషాబాద్ మున్సిపాలిటీలో కొత్తగా ఘాంసీమియాగూడను చేర్చారు. అలాగే మీర్జాగూడ పంచాయతీని గతంలో శంకరపల్లి మున్సిపాలిటీలో చేర్చాలని భావించినప్పటికీ దీన్ని నార్సింగ్ మున్సిపాలిటీలోకి మార్చారు.

మరింత పెరగనున్న పట్టణీకరణ

విలీన గ్రామాల వివరాలు (జిల్లాల వారీగా)

	పురపాలికలు	విలీన గ్రామాలు
మేడ్చల్ (28)	ఘట్‌కేసర్	మర్రిపల్లిగూడ, ఏదులాబాద్, ఘనాపూర్, అంకుశాపూర్, అవుశాపూర్, మాదారం
	నాగారం	భోగారం, గోధుమకుంట, కరీంగూడ, రాంపల్లి దాయర
	తూంకుంట	బాబాగూడ, బొమ్మరాశిపేట, శామీర్‌పేట
	మేడ్చల్	రాయిలాపూర్, పూడూరు
	గుండ్లపోచంపల్లి	గౌడవెల్లి, మునీరాబాద్
	దమ్మాయిగూడ	కీసర, యాద్గార్‌పల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి
	పోచారం	చౌదరిగూడ, వెంకటాపూర్, కాచవాని సింగారం, కొర్రెముల్, ప్రతాప్‌సింగారం
రంగారెడ్డి (12)	పెద్ద అంబర్‌పేట	కుత్బుల్లాపూర్, తారమతి పేట, గౌరెల్లి, బాచారం
	శంషాబాద్	రషీద్‌గూడ, బహుదూర్‌గూడ, హమీదుల్లానగర్, చిన్న గోల్కొండ, పెద్దగోల్కొండ, ఘాంసీమియాగూడ
	నార్సింగ్	మీర్జాగూడ
	తుక్కుగూడ	హర్షగూడ
సంగారెడ్డి (11)	అమీన్‌పూర్	ఐలాపూర్, ఐలాపూర్ తండా, కిష్టారెడ్డి పేట, పటేల్‌గూడ, దాయర, సుల్తాపూర్
	తెల్లాపూర్	పోచారం, ముత్తంగి, కార్దనూర్, పాటి, ఘనాపూర్

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్
- మోమిన్‌పేట మండలంలో పర్యటన

మోమిన్‌పేట్, సెప్టెంబరు 3 : భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం మోమిన్ పేట్ మండలంలోని నందివాగు ప్రాజెక్టు, కాస్లాబాద్, రామ్‌నాథ్‌గూడుపల్లి, గోవిందాపూర్, మల్లారెడ్డిగూడ గ్రామాల్లో ఆయన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాలకు గ్రామాల్లో దెబ్బతిన్న కల్వర్టుల స్థానంలో నూతన బ్రిడ్జీలను నిర్మిస్తామన్నారు. వర్షాలకు ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. దాదాపు నియోజకవర్గానికి 7వేలు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో పంటలు నష్టపోయిన రైతుల వివరాలు, ఇళ్లు కోల్పోయిన బాధితులు, రోడ్లు, విద్యుత్ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాస్లాబాద్, మల్లారెడ్డిగూడ, రామ్‌నాథ్‌గూడుపల్లి, గోవిందాపూర్ గ్రామాల రైతులకు అవసరమైన చోట నూతన కత్వాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాస్లాబాద్ చెరువు, వాగుపై బ్రిడ్జీలను, మల్లారెడ్డిగూడ, వెల్‌చాల్ గ్రామాల్లో కూలిన ఇళ్లను స్పీకర్ అధికారులతో కలిసి పరిశీలించారు. భారీ వానలతో తాండూర్, కొడంగల్ నియోజవర్గాల పరిధిలో నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వ పరంగా ఒక్కో ఇంటికి రూ.3200 అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ మనోహర చక్రవర్తి, ఎంపీడీవో విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి జయశంకర్, ఎంపీవో యాదగిరి, ఆర్ఐగోవర్ధన్, ఏపీవో శంకరయ్య, ఏపీఎం రాజు, మన్నె శంకర్‌యాదవ్, సిరాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



కస్లాబాద్‌లో బ్రిడ్జి వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

మట్టిని దేవునిగా చేద్దాం.. భక్తిని పూజగా అర్పిద్దాం

- కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, సెప్టెంబరు 3: మట్టిని దేవునిగా చేద్దాం.. భక్తిని పూజగా అర్పిద్దామని,పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను వినియోగించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం పర్యావరణ విద్యావిభాగం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన 'మట్టి గణపతులనే పూజిద్దాం' అనే వాల్‌పోస్టర్‌ను కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ప్రతీక్‌జైన్ ఆవిష్కరించారు. బీసీ సంక్షేమ అధికారులతో కలిసి ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని పిలుపునిచ్చారు. ఉపేందర్, ఏఈ ఎస్ సురేష్, మహేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న హరిచందన

ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలి

- రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన

వికారాబాద్, సెప్టెంబర్ 3: జిల్లాలో చేపడుతున్న ఫ్లైఓవర్ల పనులను వేగవంతంగా పూర్తిచేయాలని రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో చేపడుతున్నఫ్లైఓవర్లు, వేబ్రిడ్జీలు, రోడ్ల నిర్మాణాలపై కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ఆర్ అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. జిల్లాలో కొనసాగుతున్న ఫ్లైఓవర్లు, రోడ్ల పనులను నాణ్యతగా మూడునెలల్లో పూర్తి చేయాలన్నారు. నిర్మాణపనుల వివరాలను ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆమె అధికారులకు ఆదేశించారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టాలని ఆమె తెలిపారు. కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిపై సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. ముందుగా వికారాబాద్ పట్టణకేంద్రంలో రూ.96కోట్ల వ్యయంతో చేపడుతున్న ఫ్లైఓవర్ పనులను కలెక్టర్‌తో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, రాజేశ్వర్‌రెడ్డి, ఎస్ఈ వసంతనాయక్, శ్రీధర్‌రెడ్డి, రాంరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్-కోస్గి మార్గంలో కొట్టుకుపోయిన రోడ్డు

చెరువులకు గండ్లు.. తెగిన రోడ్లు

- పాక్షికంగా కూలిన వంతెనలు
- నిలిచిపోయిన రాకపోకలు
- నరకంగా మారిన ప్రయాణం

7

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలో నాలుగేళ్ల కాలంలో నాలుగు చెరువులు మాయమయ్యాయి. నారపల్లి పెద్దచెరువు, తుమ్మల చెరువు, మీరాలం చెరువు, బంధం చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. వాటిని ప్రోత్సహించిన నాయకులు ఆ నిర్మాణాలను కాపాడేందుకు ఆ చెరువుల ఉనికికే ఎసరు పెట్టారు. వర్షాకాలంలో చెరువులు నిండితే ఇళ్లలోకి నీరు చేరుతోందని గుట్టు చప్పుడు కాకుండా చెరువు కట్టలకు గండ్లు పెట్టి నీటిని కిందికి వదులుతున్నారు. దీంతో ఆ చెరువుల్లో కనీస సామర్థ్యంలో కూడా నీళ్లు ఉండటం లేదు. ఇంత జరుగుతున్నా పరిరక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవటంతో చెరువులు, కుంటలు, కత్వల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది.

కబ్జాల పర్వం 5



నారపల్లి పెద్దచెరువు

4 చెరువులు మాయం



ఇస్మాయిల్‌ఖాన్ గూడలో వాగుపై ధ్వంసం చేసిన ఆనకట్ట

- నిర్మాణాలను కాపాడుకునేందుకు కట్టలకు గండ్లు
- వాగుపై నిర్మించిన ఆనకట్టలు సైతం ధ్వంసం
- పోచారం మున్సిపాలిటీలో ఆగమాగం
- స్థానిక నాయకులు ఆడిందే ఆట పాడిందే పాట
- కన్నెత్తి చూడని రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 3: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి పెద్ద చెరువు దాదాపు 15ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. చెరువుకు ఎగువ భాగంలోని బఫర్‌జోన్ పరిధిలో ఇళ్లతో పాటు నూతన కాలనీలు వెలిశాయి. దీంతో చెరువు పూర్తి స్థాయిలో నిండినప్పుడు వరద నీరు కాలనీలను ముంచెత్తుతుంది. దీంతో అక్కడ ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. కాగా, ఆ నీటిని కిందకు తరలించేందుకు పలువురు నాయకులు ఏకంగా చెరువు కట్టకు గండి పెట్టారు. ఈ గండితో చెరువులో కేవలం 25శాతం మేరకే నీరు మాత్రమే నిలిచి ఉంటుంది. ఈ చెరువు దిగువన తుమ్మల చెరువు ఉంది. ఇది దాదాపు 14ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఎగువనున్న పెద్ద చెరువు నిండితే ఆ వరద తుమ్మల చెరువులోకి చేరుతుంది. ఈ చెరువు చుట్టూ కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాలు వెలిశాయి. ఈ చెరువు భూభాగంలోనూ పావు వంతు కుచించుకుపోయింది. దీంతో పై నుంచి వచ్చే వరద చెరువులోకి చేరుతుండటంతో ముందే మేల్కొన్న నాయకులు తాము చేసిన పాపాలు ఎక్కడ బయట పడుతాయోనని రాత్రికిరాత్రే ఈ చెరువు కట్టకు సైతం భారీగా గండి పెట్టి, చెరువులోని నీటిని కిందికి వదిలేశారు. నాలుగు సంవత్సరాలుగా ఈ చెరువు పూర్తి స్థాయిలో నిండని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు నిండితే గండిపెట్టి చెరువుల్లో నీరు నిల్వకుండా చేస్తున్నారు అక్రమార్కులు.

మడుగును తలపిస్తున్న బంధం చెరువు

అన్నోజిగూడలోని హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారికి అనుకుని ఉన్న మీరాలం కుంట చెరువును బతుకమ్మ ఘాట్ పేరుతో కొంత, చుట్టు పక్కల వ్యాపారులు కొంత భాగం ఆక్రమించి చెరువు ఆనవాళ్లు లేకుండా చేశారు. కనీసం చెరువు కింద అయిన వదిలారా అంటే కట్టకు అనుకోని భారీ నిర్మాణాలు చేపట్టారు. దీని పక్కనే బంధం కుంట చెరువు ఉంది. దీన్ని కూడా వదలలేదు. దీంతో ఆ చెరువు పూర్వ స్వరూపాన్ని కోల్పోయి చిన్న మడుగుగా మారింది. ఇలా అక్రమార్కుల చర్యలతో చెరువులకు గొలుసుకట్టు బంధం తెగిపోతున్నది. ఈ చెరువు చుట్టుపక్కల ప్రభుత్వ పాఠశాలతోపాటు శ్మశాన వాటిక, జాతీయ రహదారి, కాలనీలు వెలిశాయి. చెరువుల్లో కాలనీలు జనావాసాలుగా మారి ఇళ్లలోని డ్రైనేజీలను ఉన్న ఆ కొద్దిపాటి చెరువుల్లోకి తరలిస్తున్నారు. ఆ నీరంతా మురుగుగా మారడంతో దోమలు, ఈగలు, వ్యాధుల సాకుతో నింబంధనకు విరుద్ధంగా చెరువులకు గండ్లు కొడుతూ నీటిని కింది వదిలేస్తున్నారు.



పూడ్చివేసిన అన్నోజిగూడ మిరాలం కుంట

రియల్ వ్యాపారుల ఇష్టానుసారంగా..

ఇంతటితో ఆగకుండ అక్రమార్కులు ఎప్పుడో తాతల కాలంలో ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో బొంతకుంట వాగుపై నిర్మించిన కత్వ(ఆనకట్ట)ను రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ ప్రయోజనాల కోసం తెంపేశారు. ఇలా ఒక్క పోచారం మున్సిపాలిటీలోనే నాలుగు చెరువులు, ఒక చెక్ డ్యాం పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడక పోవటంతో చెరువులు, కుంటలు, కత్వల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. చెరువు కట్టలకు గండ్లు పెట్టి నీటిని వృథా చేస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదంతా మున్సిపాలిటీ పాలకవర్గం పెద్దల కనుసన్నుల్లోనే జరిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చెరువు కట్టలను, వాగులపై ఆనకట్టను ధ్వంసంపై విచారణ జరిపి ఆక్రమాలకు పాల్పడిన వారని గుర్తించి వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అలాగే చెరువుల విధ్వంసంపై చూసిచూడనట్లుగా వ్యవహరించిన అధికారులపైనా చర్యలు తీసుకోని చెరువులకు పూర్వవైభవం కల్పించాలని పలువురు పర్యరవణ వేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి



చెరువు కట్టలను తెంచడం చట్టవిరుద్ధం. అలాంటి చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలి. ప్రజల అవసరాలను తీర్చే చెరువులు మాయం అయితే పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుంది. చెరువులు కనుమరుగైతే మానవ మనుగడకు ముప్పు పొంచి ఉన్నందున ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చెరువుల పరిరక్షణ వెంటనే చర్యలు చేపట్టాలి.

- జీవీ సుబ్బారావు, పర్యావరణవేత్త

పెద్దల హస్తం ఉండటం వల్లే..



కన్నతల్లిలాంటి చెరువుల్ని భక్షించడం వలన రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు తప్పవు. నారపల్లిలో పెద్ద చెరువు, తుమ్మల చెరువుల కట్టలను తెంచడం వెనుక పాలకవర్గ పెద్దల హస్తం ఉన్నట్లు తెలుస్తుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్థానిక నాయకుల స్వప్రయోజనాల కోసం చెరువు కట్టలు, వాగుపై ఉన్న కత్వను ధ్వంసం చేశారు. అయినా అధికారులు చర్యలు చేపట్టక పోవడం దురదృష్టకరం.

- పి అశోక్, మత్స్యకారుల ఐక్యవేదిక కన్వీనర్

బాధ్యులపై చర్యలు తప్పవు



పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి పెద్దచెరువు, తుమ్మల చెరువుకట్టలకు గండ్లు ఉన్న విషయాన్ని పరిశీలించాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అన్నోజిగూడలోని రెండు కుంటల ఆక్రమణతోపాటు ఇస్మాయిల్ ఖాన్ గూడ వాగుపై ఉన్న కత్వ ధ్వంసం గురించి ఉన్నతాధికారులకు తెలియ జేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- పరమేశ్, ఏఈ, ఇరిగేషన్ ఘట్‌కేసర్ మండలం



సమస్యలపై తక్షణమే స్పందించండి

- జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి
- వర్షాల నేపథ్యంలో అధికారులతో సమావేశం

తలకొండపల్లి, సెప్టెంబరు 3: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ స్పందించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కృష్ణారెడ్డి కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం సీఈవో కృష్ణారెడ్డి సందర్శించారు. రికార్డులు పరిశీలించి మండలంలో జరుగుతున్న అభివృద్ధి, అసంపూర్తి పనుల గూర్చి ఎంపీడీవో శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యారోగ్యశాఖ, పంచాయతీరాజ్, రెవెన్యూ, మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సీఈవో పాల్గొన్నారు. వర్షాల నేపథ్యంలో అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, తాగునీరు కలుషితం కాకుండా పైపుల లీకేజీలుంటే సరిచేయాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి జ్వర సర్వే నిర్వహించి బాధితులకు వెంటనే వైద్యం అందించాలని సూచించారు. దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, కుంటలు, ఇళ్లు, పంట నష్టం వివరాలు అధికారులు ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. తహసీల్దార్ రంగారెడ్డి, డీటీ సంతోష్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి



అర్హులందరికీ రుణమాఫీ వర్తింపు : ఏడీఏ

ఆమనగల్లు/కడ్తాల్, సెప్టెంబరు 3: అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణమాఫీ అందుతుందని ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీఏ ఆదిలక్ష్మి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం ఏవో శ్రీలత ఆధ్వర్యంలో రుణమాఫీ కాని రైతుల సర్వే నిర్వహించారు. ఏఈవోలు రమేశ్, కేధార్‌సింగ్, వందన, అభినవ్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆమనగల్లు మండలం మేడిగడ్డ, శంకర్ కొండ తండాలలో కుటుంబ నిర్ధారణ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించారు. ఏఈవోలు ప్రభావతి, నిఖిత, భూదేవి పాల్గొన్నారు.



ఏటి కాల్వ హోరు.. చేపల వేట జోరు

- కాలువలోకి భారీగా చేరిన వరద నీరు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 3: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు బొంరాస్‌పేట్ మండలంలోనే పెద్ద ప్రాజెక్టు అయిన కాకరవాణి ప్రాజెక్టు అలుగు పారుతోంది. దాంతో బొంరాస్‌పేట్ పెద్ద చెరువులోకి వరద నీరు భారీఎత్తున చేరుతోంది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మంగళవారం ఏటి కాల్వలో వలలతో చేపలు పట్టారు.

నీట మునిగిన పంటపొలాలు

- బషీరాబాద్ మండలంలో 1500 ఎకరాల్లో పంట నష్టం


నవాంద్గీ వద్ద నీటి మునిగిన పత్తి పంట

బషీరాబాద్, సెప్టెంబరు 3: మండలంలోని పలు గ్రామాల్లో పత్తి, కంది పంటలు భారీ వర్షాలకు నీట మునిగి నష్టం వాటిల్లింది. వ్యవసాయాధికారులు 1500 ఎకరాల వరకు పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. గ్రామాల్లోని లోతట్టు ప్రాంత భూములతో పాటు, నదీ పరివాహక ప్రాంతమైన నవాంద్గీ శివారులో నది ఉప్పొంగి వరద నీరు పంట పొలాలను ముంచెత్తడంతో భారీ నష్టం వాటిల్లింది.











చెరువులకు గండ్లు.. తెగిన రోడ్లు

- నిలిచిపోయిన రాకపోకలు
- నరకంగా మారిన ప్రయాణం
- పాక్షికంగా కూలిన వంతెనలు

యాలాల/నవాబుపేట/దోమ/కొడంగల్/బొంరాస్‌పేట్/ సెప్టెంబరు 3 : మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో చెరువులు, కుంటలు, వాగుల్లో వరద నీరు భారీగా చేరింది. ఈక్రమంలో ప్రధాన రోడ్లు ధ్వంసమయ్యాయి. కొన్నచోట్ల రోడ్లు అధ్వాన్న స్థితికి చేరాయి. ప్రధాన రోడ్లపై గుంతలు పడి కంకర తేలి ఉండటంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. యాలాల మండల పరిధిలోని బాగేపల్లి-తాండూరు ప్రధాన రోడ్డు అధ్వాన స్థితికి చేరింది. పెద్ద గుంతలు ఏర్పడి నీరునిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తాండూరు వెళ్లే మెయిన్‌రోడ్డులో అన్నాసాగర్-కమాల్‌పూర్ గేట్ల మధ్యగల ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అధికారులు రోడ్డు బాగు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. నవాబుపేట మండలంలోని ప్రధాన రోడ్లు గుంతమయంగా మారాయి. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్మామిడి ప్రధాన రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. దోమ మండలంలోని ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారాయి. మండల కేంద్రంతో పాటు అంతర్గత రోడ్ల దుస్థితి అధ్వానంగా మారింది. దోమ నుంచి ఐనాపూర్‌కు వెళ్లే బీటీ రోడ్డుపై గుంతలతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. అదేవిధంగా కొడంగల్-కోస్గి రోడ్డు మార్గంలో కల్వర్టు రోడ్డు తెగిపోవడంతో వరద నీరు భారీగా ప్రవహించింది. కల్వర్టు వద్ద రోడ్డు తెగిపోవడంతో తాండూరు నుంచి మహ బూబ్‌నగర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. కొడంగల్ మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాల్లో నీరు చేరడంతో తీరని నష్టం వాటిల్లింది. కాగా, అధికారుల నిర్లక్ష్యంతో వర్షాలకు చెరువులు, కుంటలు తెగిపోయాయి. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని పెద్ద చెరువుకు వచ్చే ఏటి కాలువకు రంధ్రం పడటంతో నీరు వృథాగా వెళ్లింది. ఇరిగేషన్ అధికారులకు వివరించినా పట్టించుకోకపోవడంతో జేసీబీ సహాయంతో మరమ్మతులు చేపట్టినట్లు ఆయకట్టు రైతులు తెలిపారు. పోలెపల్లిలో కుంటకు రంధ్ర పడటంతో నీరు వృథాగా వెళ్లింది. దుద్యాలలో కుంటకు రంధ్రం పడటంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు మెరుగు వెంకటయ్య జేసీబీ సాయంతో రంధ్రాన్ని మట్టితో పూడ్చి వేయించారు.


యాలాల : అన్నాసాగర్-నాగసమందర్ మధ్య మెయిన్ రోడ్డు దుస్థితి


మేడ్చల్ టౌన్ : కింది భాగంలో పెచ్చులూడిన వంతెన


దోమ : భారీ వర్షాలకు గుంతలమయంగా మారిన దోమ-ఐనాపూర్ రోడ్డు

పాక్షికంగా కూలిన మేడ్చల్ పెద్ద చెరువు పాత వంతెన

మేడ్చల్ టౌన్ : మేడ్చల్ పట్టణంలోని పెద్ద చెరువు అలుగు పారే వాగుపై పాత వంతెన ఒక పక్క భాగం పాక్షికంగా కూలిపోయింది. భారీ వర్షాలతో అలుగు ప్రవాహానికి వంతెనకు బీటలువారాయి. మంగళవారం వంతెన కింది భాగంలో పెద్దఎత్తున పెచ్చులూడి పైనుంచి లోపల వైపు పూడ్చుకుపోయి పెద్ద గుంతలా మారింది. వంతెన పైభాగంలో గుంతగా మారటంతో అధికారులు రెండు వైపులా బారికేట్లు ఏర్పాటు చేసి కట్టపై రాకపోకలు నిషేధించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, శిథిలావస్థకు చేరుకున్న వంతెన దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు ప్రచురించగా అధికారులు తాత్కాలిక చర్యలతో సరిపెట్టుకున్నారు. అలుగు మరింత ఉధృతంగా ప్రవహిస్తే వంతెన మొత్తం కుప్పకూలే ప్రమాదం లేకపోలేదు. కాగా, జాతీయ రహదారిపై చేపడుతున్న పనుల కారణంగా పట్టణంలో ప్రవేశించే వాహనదారులు చెక్ పోస్టు నుంచి నేరుగా పెద్ద చెరువు కట్ట మీద నుంచి పట్టణంలోకి ప్రవేస్తున్నారు. దాంతో కట్టపై వాహనాల రాకపోకలు పెరిగి శిథిలావస్థకు చేరిన వంతెనపై నుంచి ఎక్కువ వాహనాలు వెళితే అది కూలే స్థితికి చేరుకుంటుందని స్థానికులు వాపోతున్నారు. కాగా, వంతెన కూలుతున్న విషయం తెలుసుకున్న ఇరిగేషన్ శాఖ ఏఈ నిఖిత వంతెన వద్దకు చేరుకుని పరిస్థితులను సమీక్షించి కట్టపై రాకపోకలను నిలిపివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కూలిన జుంటివాగు చెక్‌డ్యాం సైడ్‌వాల్

తాండూరు రూరల్ : భారీ వర్షాలకు మండల పరిధిలోని గోనూరు శివారులో గల జుంటివాగు చెక్ డ్యాం సైడ్‌వాల్ 80శాతం కూలిపోయింది. తూముకు షట్టర్ లేకపోవడంతో నీరంతా కిందికి వృథాగా పోతోంది. మరోపక్క చెక్‌డ్యాం గోడ శిథిలావస్థకు చేరి వర్షాలకు కూలిపోయింది. దాంతో ఆ ప్రాతంలో నీరు నిలిచే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. ఇదే స్థాయిలో వర్షాలు కురిస్తే నీరంతా గోనూరు గ్రామంలోకి చేరే ప్రమాదం ఉందని గ్రామస్థులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీఆర్ఎస్ హయాంలో ఈ చెక్ డ్యాం మరమ్మతులకు రూ.40లక్షల వరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇరిగేషన్ అధికారులు నామమాత్రంగా పనులు చేసి బిల్లులు తీసుకున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పనుల్లో నాణ్యత లేకపోవడంతో భారీ వర్షానికి చెక్‌డ్యాం పక్కగోడ పూర్తిగా కూలిపోయిందని, ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


భారీ వర్షానికి తాండూరు మండలం గోనూరు పరిధిలో కూలిపోయిన జుంటివాగు సైడ్‌వాల్


మామిడికుంట బఫర్ జోన్‌లో నిర్మించిన విల్లాలను చూపిస్తున్న బక్కని నర్సింహులు

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను పరిరక్షించండి

- సీఎస్‌కే విల్లాస్‌పై విచారణ జరిపించాలి
- మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 3: చెరువులు, కుంటలు, పాటుకాలువలను పరిరక్షించుటలో పాలకులు స్వార్థపూరితంగా వ్యవహరించడంతోనే ప్రకృతి ప్రకోపానికి కారణమవుతున్నదని, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను పరిరక్షించాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. ఫరూఖ్‌నగర్ శివారు జాలాదికుంట, మామిడికుంటలను టీడీపీ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. రెండు కుంట మ్యాప్‌లను, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో కట్టిన నిర్మాణాలను పరిశీలించారు. జాలాదికుంట, మామిడికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో సీఎస్‌కే విల్లాలను నిర్మించారని, వాటిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఆజాం అల్లిఖాన్ తోటలోని చారిత్రాత్మక కట్టడాలను సైతం కూల్చి, పూడ్చివేసి, సీఎస్‌కే విల్లాలను నిర్మించారని గుర్తుచేశారు. ఈ వ్యవహారాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్‌రెడ్డి, అధికార ప్రతినిధులు నెల్లూరు దుర్గాప్రసాద్, డాక్టర్ ఏఎస్ రావులు డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు లింగారం కుమార్‌గౌడ్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, గంధం ఆనంద్, శ్రీరాములు, అనంతం, శ్రీనివాస్, కుమార్ తదితరులున్నారు.

మామిడికుంట గండి పరిశీలన

భారీ వర్షాలకు ఫరూఖ్‌నగర్ శివారులో గల మామిడికుంట కట్టపై నుంచి వరద నీరు పోవడంతో గండి పడింది. దాంతో షాద్‌నగర్ నుంచి బొబ్బిలిచెరువు మీదుగా రాసుమల్లెగూడెంకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈమేరకు మంగళవారం బక్కని నర్సింహులు, టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. అధికారులు గండిని వెంటనే పూడ్చాలని ఆయన కోరారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డీఎంఅండ్‌హెచ్‌వో పాల్వన్‌కుమార్


ప్రభుత్వాసుపత్రిలో మందులను పరిశీలిస్తున్న పాల్వన్‌కుమార్

నవాబుపేట, సెప్టెంబరు 3: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వికారాబాద్ జిల్లా వైద్యాధికారి పాల్వన్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫార్మసీ స్టోర్‌లో మందులు, లేబోరేటరీని పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సమావేశంలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, గర్భిణీలకు అన్నిరకాల పరీక్షలు పీహెచ్‌సీ లేదా జిల్లా ఆసుపత్రిలో చేయించాన్నారు. వైద్యాధికారి రోహిత్, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం

- జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణీకర్
- ఎయిర్‌పోర్టులో నూతన హోటల్‌ను ప్రారంభించిన జెపాడ్ కంపెనీ


మాట్లాడుతున్న జాగృత్ థక్కర్


శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 3: విమాన ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే జీఎంఆర్ ఎయిర్‌పోర్టు లక్ష్యమని సీఈవో ప్రదీప్ ఫణీకర్ అన్నారు. మంగళవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జీఎంఆర్ జెపాడ్ సంయుక్తంగా నూతన హోటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో ఫణీకర్ మాట్లాడుతూ విమాన ప్రయాణికుల సంఖ్య ప్రతీ ఏడాది గణనీయంగా పెరుగుతోందని వారికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించడం జరుగుతోందన్నారు. ఎవరైన ప్రయాణికులు ఫ్లైట్ మిస్సైన రెండు మూడు గంటలు ఈ హోటల్‌లో సేద తీరవచ్చాన్నారు. జెపాడ్ హోటల్ ఎండీ జాగృత్ థక్కర్ మాట్లాడుతూ... ప్రపంచ స్థాయి ప్రమాణాలతో జెపాడ్ హోటల్‌ను తీర్చిదిద్దామని చెప్పారు. ఇతర హోటల్స్‌తో పోల్చితే ధర చాల తక్కువగా ఉంటుందని చెప్పారు. 2021లో ముంబై సెంట్రల్ స్టేషన్లలో రెండు పాడ్ హోటల్స్‌ను ప్రారంభిచామని చెప్పారు. త్వరలోనే ముంబయి, బెంగుళూర్, ఢిల్లీ ఎయిర్‌పోర్టుల్లో ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నామన్నారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్టులో కలిసి భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జెపాడ్ డైరెక్టర్ హిరేన్ గాంధీ, జెపాడ్ కంపెనీ ప్రతినిధులు, జీఎంఆర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భజలాల పెంపుపై అవగాహన


రైతులతో మాట్లాడుతున్న ఢిల్లీ ఎన్‌జీవో బృందం అధికారులు

మర్పల్లి, సెప్టెంబరు 3: ఏడాదికి రెండు పంటలు పండించేందుకు భూగర్భజలాలు ఎలా పెంచాలనే దానిపై ఢిల్లీ ఎన్‌జీవో మధుసూదన్‌తివారీ, సుమిత్ బృందం అవగాహన కల్పించింది. మంగళవారం మర్పల్లి మండలంలోని కల్కోడ గ్రామంలో బృందం పర్యటించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భూగర్భజలాలు పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తుందని తెలిపారు. భూగర్భజలాలు పెంచిన గ్రామాల్లో దాదాపు రెండు వేల ఎకరాలకు పైగా నీరు అందే విధానంపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 8 రాష్ట్రాల్లో ఈ విధానాన్ని అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వికారాబాద్ జిల్లా మర్పల్లి, బొంరాస్‌పేట్, కోట్‌పల్లి మండలాల్లోని ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. వచ్చేనెల 12న మూడు మండలాల రైతులతో సలహాలు, సూచనలు తీసుకొని భూ గర్భజలాలు పెంచే విధంగా అవగాహన కల్పిస్తామన్నారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, ఎంపీడీవో రాజమల్లయ్య, ఏపీవో అంజిరెడ్డి, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పరిగి, సెప్టెంబరు 3: కలకత్తాలో వైద్యవిద్యార్థి హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్య విద్యార్థి హత్యాచారం ఘటనలో నిందితులను గుర్తించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సత్యయ్య, రఘురాం, శేఖర్, మొగులయ్య, ప్రశాంత్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో పత్తి పంటకు తీరని నష్టం

- వాడిపోయి ఎర్రబారుతున్న మొక్కలు
- ఆందోళనలో కర్షకులు


పెద్దేముల్ : వాడిపోతున్న పత్తిపంటను చూపుతున్న రైతు

పెద్దేముల్/షాబాద్/తాండూరు రూరల్, సెప్టెంబరు 3 : ముసురు వానతో పత్తి పంటలకు తెగులుసోకి వాడిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెద్దేముల్ మండలంలో రైతులు పెద్దమొత్తంలో పత్తి పంట సాగుచేశారు. గత మూడురోజులుగా కురిసిన వర్షాలకు పత్తిపంటలు దెబ్బతిన్నాయి. వాడుముఖం పట్టి ఆకులు నేలవైపు వాలుతున్నాయి. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి కాయలు కాసే సమయంలో పంట ఇలా వాడిపోవడం ఆందోళన కలిగిస్తుందని రైతులు వాపోతున్నారు. అలాగే షాబాద్ మండలంలోని మల్లారెడ్డిగూడ, ఎర్రోనిగూడ, సీతారాంపూర్, షాబాద్ తదితర గ్రామాల పరిధిలో సుమారు 50 ఎకరాల్లో పత్తి పంట వర్షానికి, నీరు ఎక్కువై నిద్రావస్థకు చేరుకుంటోంది. మల్లారెడ్డిగూడకు చెందిన పలువురి పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. తాండూరు మండలం ఖాంజాపూర్‌లో పత్తి పంట పూతరాలి ఎర్ర బారుతోంది. దాంతో మొక్క కుళ్లిపోతోందని రైతులు వాపోతున్నారు. పత్తికాయలు కూడా రాలిపోతున్నాయి. పెసర పంటలూ దెబ్బతిన్నాయి. రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

వీలైనంత త్వరగా నీటిని తీసేయాలి



అధిక వర్షాలు కురవడంతో పత్తిపంట వాడుముఖం పట్టినట్లు గుర్తించాం.వర్షాధార పంటగా సాగుచేసిన పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా వీలైనంత త్వరగా తీసివేయాలి. అనంతరం ఎకరాకు 20 కిలోలు యూరియా, 15 కిలోలు మ్యూరెట్‌ఆఫ్ పొటాష్ వేయాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు, 1 గ్రాము కార్బండిజిమ్, లేదా 2.5గ్రాముల మాంకోజెబ్ రెండు నుంచి మూడుసార్లు మార్చి మార్చి పిచికారీ చేయాలి. లద్దె పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి. రెండుశాతం యూరియా ద్రావణం లేదా ఒక శాతం మల్టీ-కే ద్రావణం పిచికారీ చేయాలి.

- రుద్రమూర్తి, ఏడీఏ, పెద్దేముల్


తాండూరు రూరల్ : ఖాంజాపూర్‌లో ఎర్రబారుతున్న పంట


షాబాద్ : మల్లారెడ్డి గూడలో దెబ్బతిన్న పత్తి చేను

అమలుకు నోచుకోని ఉత్తర్వులు

- విడుదల కాని పాఠశాలల పారిశుధ్య నిర్వహణ నిధులు


ప్రభుత్వ పాఠశాల

మేడ్చల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేసేందుకు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటున్నా, ఆ అంశాలను అమలు చేయడంలో జాప్యం జరుగడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా స్కావెంజర్లను నియమించుకోవాలని విద్యాశాఖ నిర్ణయించింది. నిధుల విడుదలకు జీవో సైతం జారీ చేసినా, అడుగు ముందుకు పడటం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు స్కూల్ ఫెసిలిటీ మెయింటెనెన్స్ పేరుతో ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని విద్యాశాఖ గత నెల 30న జీవో విడుదల చేసింది. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా విడుదలయ్యే కాంపోజిట్ స్కూల్ గ్రాంటుకు అదనంగా వీటిని అందజేయనున్నామని అందులో పేర్కొన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా, ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదు. జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 515 ఉండగా.. వాటిలో 90 వేలకు పైగా విద్యార్థులున్నారు. ఈ బడుల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు సిబ్బంది లేరు. గత ప్రభుత్వ హయాంలో స్కావెంజకర్లను తొలగించి పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను పంచాయతీలు, మున్సిపాల్టీల పారిశుధ్య కార్మికులకు అప్పగించింది. ఆ ప్రక్రియ ఎక్కడా సరిగా అమలు కాలేదు. ఈ పరిస్థితిని గమనించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్కూల్ ఫెసిలిటీ మెయింటెనెన్స్ గ్రాంటు ఇస్తామంది. అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల ఖాతాలో మూడు నెలల నిధులను ముందే జమ చేయబోతున్నట్లు వెల్లడించారు. జీవో రాగానే పంచాయతీల సిబ్బంది తమకు బాధ్యతలు లేవన్నట్లుగా పూర్తిగా చేతులెత్తేశారు. నిధులు ఖాతాల్లో జమైన తర్వాతనే ముందుకు వెళ్లాలని అమ్మ ఆదర్శ కమిటీలు, పాఠశాలల నిర్వాహకులు భావిస్తున్నారు. అప్పటి వరకు అవస్థలు తప్పడం లేదు. దీనిపై విద్యాశాఖ సత్వరం చర్యలు తీసుకుని నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

అప్రూవల్ వచ్చింది.. బ్యాంకుకు పంపించాం



పాఠశాలల్లో స్కూల్ ఫెసిలిటీ మెయింటెనెన్స్ గ్రాంటు కోసం కలెక్టర్ నిధుల నుంచి తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు కలెక్టర్ కూడా ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల విడుదల కోసం బ్యాంకుకు పంపించాం. ఒక్కో నెలకు సంబంధించి రూ. 39 లక్షలు అవసరమౌతాయి. మూడు నెలలకు రూ. 1.17 కోటి నిధులు చేయాల్సి ఉంటుంది.

- విజయకుమారి, జిల్లా విద్యాధికారి

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు


రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

షాద్‌నగర్, సెప్టెంబరు 3: వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఆయన మంగళవారం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జ్వరాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 9 డెంగీ కేసులు నమోదు కాగా 8 మంది కోలుకోగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశామన్నారు. విష జ్వరాలు, డెంగీ, చికెన్‌గున్యా వ్యాధులను నిర్ధారణ చేయడానికి అవసరమైన కిట్లను ఇప్పటికే ఆస్పత్రులకు పంపిణీ చేశామన్నారు. ఒంట్లో ఏ మాత్రం నలతగా ఉన్నా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత లేకపోవడం వల్లనే డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఈ వ్యాధుల నుంచి దూరంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యవంతులు కూడా కాచి వడబోసిన గోరు వెచ్చటి నీళ్లు, అప్పుడే వండిన పదార్థాలను మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు డీడీఎంహెచ్‌వో విజయలక్ష్మి, కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ కె శ్రీనివాసులు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గురుకులాల్లో సమస్యల పరిష్కారానికి కృషి


ఆర్‌సీవోకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

కులకచర్ల, సెప్టెంబరు 3: గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులకు వివరిస్తామని గిరిజన సంక్షేమ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి సుధాకర్ తెలిపారు. మండల పరిధిలోని బండవెల్కిచర్ల గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆర్‌సీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రిన్సిపాల్ గంగారం అక్రమాలకు పాల్పడ్డారని చర్యలు తీసుకోవాలని కోరారు. జరిగిన పలు అక్రమాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దినసరి కూలీలుగా స్థానికులకు అవకాశం కల్పించాలని కోరారు. ఖాళీగా ఉన్న అధ్యాపకులు, ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. ఇక్కడి అన్ని విషయాలు తమ దృష్టికి వచ్చాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోమవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తనిఖీ చేసిన మరుసటి రోజే ఆర్‌సీవో రావడం గమనార్హం.

గ్యారంటీలను పక్కాగా అమలు చేయాలి

పరిగి, సెప్టెంబరు 3: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలైన ఆరుగ్యారంటీలను పక్కాగా అమలుచేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం పరిగిలో మహిళా సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ మహిళలు అనేక రకాలుగా సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి హక్కుల కోసం పోరాడతామన్నారు. రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు అర్హులకు అందడం లేదని, ఇందిరమ్మ ఇళ్లు అందజేయాలన్నారు. పరిగి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మి, వెంకటమ్మ, సభ్యులు అనసూయ, దేవమ్మ, లక్ష్మి, గౌసియా బేగం, అలివేలు, మొగులమ్మ, అనిత, రాములమ్మ తదితరులున్నారు.


పరిగిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకురాళ్లు

పెద్ద చెరువు అలుగులో గంగపూజ


ఊరేగింపుగా వెళ్తున్న స్థానికులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 3: మేడ్చల్ పెద్ద చెరువులో మంగళవారం గంగ తెప్ప జూపను నిర్వహించారు. ప్రతీ సంవత్సరం చెరువు నిండి అలుగు పారిన వేళ మేకను గంగ తెప్పపూజ నిర్వహించి నీళ్లలో వదలడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోని బొడ్రాయి నుంచి స్థానికులు మేకపిల్ల, గంగ తెప్పతో ఊరేగింపుగా పెద్దచెరువు వద్దకు చేరుకుని సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించి మేకపిల్లను గంగ తెప్పను అలుగులో వదిలారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మర్రి నర్సింహారెడ్డి పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేముల శ్రీనివాస్‌రెడ్డి, కౌడె మహేష్ సందీప్ గౌడ్, సుదర్శన్‌రెడ్డి, సత్యనారాయణ, రాఘవేందర్‌గౌడ్, బాల మల్లేష్, ఆర్.శ్రీనివాస్‌గౌడ్, సీహెచ్.శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, సెప్టెంబరు 3: విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. యంగ్ ఓరేటర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంత్ర, శిక్షాలోకం, భారత్ దేఖో, అలోకిత్ సంస్థలు పాల్గొని మండల రీసోర్స్‌పర్సన్లు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఆంగ్లంలో మాట్లాడే నైపుణ్యాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అన్ని పాఠ్యాంశాల బోధనతో పాటు ఆంగ్లంలో మాట్లాడే నైపుణ్యాలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మాతృభాషతో పాటు ఆంగ్లంలో కూడా మాట్లాడగలుగుతామనే విశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. వారంలో రెండు రోజులు ఆంగ్లంలో మాట్లాడే నైపుణ్యంపై ప్రత్యేక తరగతులు తీసుకోవాలని సూచించారు. బోధించే సబ్జెక్టుపై ఉపాధ్యాయులకు పూర్తి పట్టుఉన్నప్పుడే విద్యార్థుల్లోనే నైపుణ్యాన్ని ప్రదర్శింపజేయాలని కలెక్టర్ తెలిపారు. చిత్ర, సంభాషణతో పాటు వివిధ అంశాలతో పిల్లల్లో ఎలాంటి భయం లేకుండా ఇంగ్లీష్‌లో మాట్లాడే విధంగా శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. యంగ్ ఓరేటర్స్ క్లబ్ నిర్వహిస్తున్న వర్క్‌షాపు ఉపాధ్యాయులకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ వర్క్‌షాపు కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి నిర్వాహక ముఖ్యులు పవిత్ర, అభిజిత్‌లతో సంస్థలసభ్యులు నిక్షిత్, మొహవిన్, యాన్సి, ఎలిజిబిత్ పాల్గొన్నారు.

చెత్త తరలింపులో జులుం

- టెండర్ లేకుండానే వసూళ్లు
- రూ.100 ఇస్తేనే చెత్త సేకరణ
- ఫిర్యాదులను పట్టించుకోని కమిషనర్


ప్రైవేట్ చెత్త వాహనం

తాండూరు, సెప్టెంబరు 3: తాండూరు మున్సిపాలిటీలో టెండర్ ప్రక్రియ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు సానిటేషన్ కొనసాగుతోంది. రూ.100ఇస్తేనే చెత్తను వేసుకుంటామని, లేదంటే కింద పారబోసి పోతానంటూ ప్రైవేట్ సానిటేషన్ వాహనదారుడు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాడు. ఈ దౌర్జన్యంపై సెలరోజులుగా స్థానికులు మున్సిపల్ కమిషనర్ విక్రమ సింహారెడ్డి దృష్టికి తీసుకెళ్తున్నారు. అయితే ఆయన మీరు డబ్బులివ్వాల్సిందేనంటూ నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెండేళ్ల కిందట ప్రైవేట్ సానిటేషన్ వాహనాల ద్వారా చెత్త సేకరించాలని, నామమాత్రం ఫీజు వసూలు చేయాలని నిర్ణయించారు. ప్రైవేట్ సానిటేషన్‌ను ప్రారంభించారు. ఈ టెండర్ ప్రక్రియ గడువు ముగిసింది. టెండర్ ముగిసినా ప్రైవేట్ సానిటేషన్ వ్యక్తులు రూ.100ను వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. గత నెల 3న జరిగిన కౌన్సిల్ సమావేశంలో సానిటేషన్‌ను ప్రైవేటు వ్యక్తులకు టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగించాలని కమిషనర్ చేసిన ప్రతిపాదనలు కౌన్సిల్ తిరస్కరించడం గమనార్హం.

ఏటి కాల్వ సమస్య పునరావృతం కావొద్దు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 3: బొంరాస్‌పేట్ పెద్ద చెరువుకు వచ్చే ఏటి కాల్వ సమస్య ఏళ్లు గడుస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదని, తిరిగి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల నాయకులు ఇరిగేషన్ డీఈ కిరణ్‌కుమార్‌తో కోరారు. ఆయన మంగళవారం బొంరాస్‌పేట్ పెద్ద చెరువు ఏటి కాల్వను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, సీనియర్ నాయకులు వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, రాజేశ్‌రెడ్డి, మల్లికార్జున్, వీరేశం, కృష్ణ, నర్సిములుయాదవ్, కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

కొత్త పంచాయతీల్లో వార్డుల విభజనకు కసరత్తు


ఓటరు మ్యాపింగ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

బషీరాబాద్, సెప్టెంబరు 3: బషీరాబాద్‌లో కొత్తగా మరో మూడు గ్రామ పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం మండల వ్యాప్తంగా మూడు అనుబంధ గ్రామాలకు కొత్తగా పంచాయతీల హోదా కల్పిస్తూ ఇటీవల గెజిట్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొత్త జీపీలుగా ఏర్పాటైన మల్కన్‌గిరి, గంగ్వార్, పర్శ్యానాయక్‌తండాలో 2011 జనాభా లెక్కల ప్రకారం వార్డుల ఏర్పాటుతో పాటు ఓటర్ల విభజన జాబితాను ఇప్పటికే అధికారులు సిద్ధం చేశారు. దీంతో మండలంలో గ్రామ పంచాయతీల సంఖ్య 39కి చేరుతాయి. ఆయా పంచాయతీల ఓటర్ల లిస్టులను సంబంధిత జీపీలతో పాటు మండల పరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డులో పెడతామని ఎంపీడీవో గాలి యాదయ్య తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి 13 వరకు ఎమైనా అభ్యంతరాలుంటే స్వీకరిస్తామన్నారు. అనంతరం డీపీవోకు నివేదించి త్వరలో తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని ఆయన వివరించారు. కాశీంపూర్ పంచాయతీ అనుబంధ గ్రామం మల్కన్‌గిరి గ్రామస్తులు ప్రత్యేక పంచాయతీ కోసం చేస్తున్న రెండేళ్ల పోరాటం ఫలించింది. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చొరవతో ఎట్టకేలకు పంచాయతీ హోదా కల్పిస్తూ గెజిట్ రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరపాలి

శామీర్‌పేట, సెప్టెంబరు 3: గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరపాలని మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్ పిలుపునిచ్చారు. గణేశ్ ఉత్సవాలను పురస్కరించు కుని మంగళవారం సాయంత్రం తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, పేట్‌బషీరాబాద్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్లు, గణేశ్ ఉత్సవాల కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.


శామీర్‌పేట: చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, ఇన్‌స్పెక్టర్

ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ సునీత, ఎస్‌ఐ సురేందర్‌రెడ్డి, మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం దేవరయాంజాల్‌లోని చెరువును మున్సిపల్ కమిషనర్, ఇన్‌స్పెక్టర్‌తో పాటు మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ వాణివీరారెడ్డి, కౌన్సిలర్ నర్సింగ్‌రావుగౌడ్‌లు సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.

కులకచర్ల: వినాయక ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు. స్థానిక విజయచంద్ర ఫంక్షన్ మాల్‌లో మంగళవారం మండలంలోని వినాయక మండపాల నిర్వాహకులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే ప్రతీ ఒక్కరూ వివరాలు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలని దౌల్తాబాద్ ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వరాదన్నారు.

బషీరాబాద్: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతగా జరుపుకోవాలని ఎస్‌ఐ గఫార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం గణేశ్ మండపాల నిర్వాహకులతో పాటు స్థానిక పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. మండపాల వద్ద పేకాట, మద్యం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో నవాంద్గీ పీఏసీఎస్ ఛైర్మన్ అజయ్‌ప్రసాద్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: వినాయక ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి సూచించారు. పోలీసు స్టేషన్‌లో మంగళవారం శాంతిసంఘం సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వినాయక ఉత్సవాల్లో డీజేలు నిషేధమని తెలిపారు.

బొంరాస్‌పేట్: పండగలను ప్రతీ ఒక్కరు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం వివిధ పార్టీల నాయకులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, నిబంధనలు పాటించాలని సూచించారు.


దౌల్తాబాద్: గణేశ్ మండప నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రవిగౌడ్

మండపాల వద్ద సౌకర్యాలు కల్పించండి

తాండూరు: వినాయక చవితిని పురస్కరించుకొని తాండూరు పట్టణంలో ప్రతిష్ఠించే వినాయకుల మండపాల వద్ద సౌకర్యాలు కల్పించాలని హిందూ ఉత్సవ కేంద్రసమితి ప్రతినిధులు మంగళవారం మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. ప్రధాన కార్యదర్శి, మాజీ డీపీసీ సభ్యుడు పటోళ్ల నర్సింహులు, ఉపాధ్యక్షుడు రఘు ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం వినతిపత్రాన్ని మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్రీకాంత్‌రెడ్డి, పడమటి వెంకటేశం, రమేష్ తదితరులు ఉన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు


రోడ్డును బాగు చేయిస్తున్న అనిల్‌నాయక్

కొడంగల్, సెప్టెంబరు 3: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో మండలంలోని పోచమ్మతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మైసమ్మతండా రోడ్డు కొట్టుకుపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో తండాకు చెందిన అనిల్‌నాయక్ తన తోటిస్నేహితులతో కలిసి స్వచ్ఛందంగా సొంత డబ్బులతో రోడ్డుపై మొరం వేయించి చదును చేశారు. దీంతో తండావాసులు ఆయనను అభినందించారు.

చెరువుకు పడిన గండి పూడ్చివేత


జేసీబీ సాయంతో చెరువు గండిని పూడుస్తున్న సిబ్బంది

కులకచర్ల, సెప్టెంబరు 3: తిరుమలాపూర్ గ్రామ బసిరెడ్డి చెరువుకు పడిన గండిని మంగళవారం జేసీబీలతో పూడ్చి వేశారు. మూడు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో చెరువు నిండి అలుగు పారింది. చెరువు కట్ట మధ్యలో గండిపడటంతో గుర్తించిన రైతులు సొసైటీ ఛైర్మన్ కనకం మొగులయ్యకు తెలిపారు. స్పందించిన ఆయన వెంటనే ట్రాక్టర్లతో మట్టిని తెప్పించి జేసీబీలతో గండిని పూడ్చివేయించారు. దీంతో కట్టకు ప్రమాదం తప్పిందని ఆయకట్టు రైతులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న కళాకారుల బృందం

కీసర రూరల్, సెప్టెంబరు 3: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని దమ్మాయిగూడ మున్సిపల్ ఛైర్మన్ వసుపతి ప్రణీత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం స్వచ్ఛతపై తెలంగాణ సాంస్కృతిక కళాకారుల బృందం పాటల రూపేణ అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రచారం చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కళాకారుల బృందం పాల్గొన్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ

పెద్దేముల్, సెప్టెంబరు 3: ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శ్రావణ మాసం ముగింపు సందర్భంగా కందనెల్లిలో మంగళవారం ఉదయం భజన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుఝాము వరకు నిర్విరామంగా భజనలు చేశారు. తాండూరు పట్టణ సమీపంలోని రాజీవ్‌గృహ కల్ప శ్రీభవానీమాత మహిళాభక్త బృందం, వికారాబాద్ గంగవరం సద్గురు భజనమండలి ఆధ్వర్యంలో కందనెల్లిలో అభయాంజేయ స్వామి ఆలయంలో భజనలు చేశారు.

తాండూరు: తాండూరులోని భద్రేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి ఆలయ పూజారి విజయ్‌కుమార్ అన్నాభిషేక అలంకరణ చేశారు.

పరిగి: పట్టణంలో శ్రీవీరభద్రేశ్వరస్వామి జయంతి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీరశైవ సమాజం ఆధ్వర్యంలో మంగళవారం బాహర్‌పేట్‌లోని శ్రీవీరభద్ర ఆలయంలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారికి, శివలింగానికి పంచ అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. నస్కల్ నట్‌రాజ్ పంతులు, మఠం శేఖరయ్యస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మఠం వినయ్‌కుమార్, చంద్రశేఖర్, బుచ్చిలింగం, శివలింగం, శివరాజ్ పాల్గొన్నారు.


పరిగి: వీరభద్రేశ్వరస్వామికి పూజలు చేస్తున్న వీరశైవ సమాజం సభ్యులు

ఆలయాల్లో అన్నదానం

వికారాబాద్: శ్రావణ మాసంలో భాగంగా బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో వీరశైవ సమాజం సభ్యులు నెల రోజుల పాటు అన్నదానం నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుగ్గ రామలింగేశ్వరాలయంలో మంగళవారం అన్నదానం ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఆత్మలింగం, కౌన్సిలర్ గోపాల్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, వేణు, మేక చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: మండల కేంద్రంలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళ వారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద శామీర్‌పేటకు చెందిన దేశం బాల్‌రాజ్‌గౌడ్-శివరాణి దంపతులు, బత్తిని వెంకటేశ్‌గౌడ్-సౌందర్య దపంతులు, దేశం నరేష్‌గౌడ్(పోలీస్)-జ్యోతి దంపతులు, టి. శేఖర్‌గౌడ్-రాజేశ్వరి దంతపులు తూంకుంటకు చెందిన భాస్కర్‌చారి, శ్రీనివాస్‌చారి, శామీర్‌పేట గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

తాండూరు రూరల్: కరన్‌కోట్‌లో మారెమ్మ ఆలయంలో శ్రావణ మాసం ముగింపు సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాల్‌రెడ్డి, డైరెక్టర్లు జర్నప్ప, ఉదయభాస్కర్‌రెడ్డిలను సన్మానించారు. అనంతరం మారెమ్మ ఆలయంతోపాటు అల్లాపూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు రాజ్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.


వికారాబాద్: పూజల్లో మాజీ ఎమ్మెల్యే

ధ్యానంతో మానసిక ప్రశాంతత

కొడంగల్: ప్రతీ రోజు కొంత సమయాన్ని కేటాయించి ధ్యానం చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ జగద్గురు నిరంజన మఠం పీఠాధిపతి సిద్ధిలింగమహాస్వామి అన్నారు. కొడంగల్‌లోని నిరంజన మఠంలో బసవేశ్వరస్వామికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధిలింగమహాస్వామి భక్తులను ఉద్దేశించి ప్రవచనలు చేశారు. వీరశైవ లింగాయత్ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, బస్వరాజ్, సంగప్ప, నాగభూషణం, శాంతుకుమార్ పాల్గొన్నారు.


కొడంగల్: సిద్ధిలింగ మహాస్వామితో భక్తులు

సంక్షిప్తంగా..

- **మేడ్చల్ టౌన్:** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మేడ్చల్ పరిధిలోని ఎన్‌జీవో కాలనీ వీధుల్లో నిలిచిన మురికినీటిని మంగళవారం స్థానిక కౌన్సిలర్ నడికొప్పు ఉమానాగరాజు మున్సిపల్ సిబ్బందితో కలిసి శుభ్రం చేయించారు. వీధుల్లో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని మున్సిపల్ సిబందితో తొలగించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు.
- **కులకచర్ల:** రాంరెడ్డిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలకు మాజీ ఉపసర్పంచ్ దామోదర్‌రెడ్డి సౌండ్ బాక్స్ అందజేశారు. ఆగస్టు 15న పాఠశాలలో జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు మంగళవారం పాఠశాలకు సౌండ్ బాక్సు బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయురాలు నందిని పాల్గొన్నారు.
- **తాండూరు రూరల్:** గ్రామాల్లో ఓటరు జాబితాలను వార్డుల వారీగా విభజించాలని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ సూచించారు. ఆయన పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో శానిటేషన్, తాగునీటి సమస్యలు, వీధి దీపాల సమస్య లేకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శులు, ఎంపీవో ఆనంద్ పాల్గొన్నారు.
- **వికారాబాద్:** రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఏబీవీపీ నగర కార్యదర్శి మహేష్‌సాగర్ తెలిపారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. ఏబీవీపీ రాష్ట్ర స్థాయి సమావేశాలు నల్గొండలో నిర్వహించి అనేక సమస్యలపై రాష్ట్ర స్థాయి నేతలతో చర్చించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రూ.7500కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేయాలన్నారు.
- **కొడంగల్ రూరల్:** కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని పాత కొడంగల్ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు మంగళవారం కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 480 మంది విద్యార్థులకు కంటి వైద్యులు శ్రీకాంత్, నాగేశ్వర్‌రావులు విద్యార్థులకు దూరపు చూపు, దగ్గరి చూపు పరీక్షలు నిర్వహించి అద్దాలు అవసరం అయ్యే వారికి కంటి అద్దాలను అందజేస్తామని తెలిపారు.
- **బొంరాస్‌పేట్:** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్ జయకృష్ణ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాంచంద్రారెడ్డి, రాజేశ్‌రెడ్డి, వెంకట్రాములుగౌడ్, అంజిల్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వరకట్న వేధింపులు.. మామపై హత్యాయత్నం


నిందితుడు యాదగిరి

కీసర రూరల్, సెప్టెంబరు 3: కట్నం కోసం పిల్లనిచ్చిన మామపైనే హత్యాయత్నం చేసిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కీసర సీఐ వెంకటయ్య కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బొల్లారం నివాసి పత్తి యాదగిరి జవహర్‌నగర్ మున్సిపాలిటీ అంబేడ్కర్‌నగర్‌లో నివాసముంటూ ఆల్వాల్ మున్సిపాలిటీలో పనిచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. నాగారం మున్సిపాలిటీ రామలింగేశ్వర కాలనీకి చెందిన కుతాల అశోక్‌కు ఇద్దరు కుమారులు, కుమార్తె అనూష ఉన్నారు. కాలేజీలో క్లాస్‌మేట్ అయిన అనూషతో ప్రేమాయణం కొనసాగించాడు. అనూష తండ్రి అశోక్ వారి ప్రేమను అంగీకరించలేదు. దీంతో వారు 2021 డిసెంబర్ 10న ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కాగా ఏడాది కిందట వారికి పాప జన్మించింది. మనవరాలు జన్మించటంతో అశోక్ తన కుటుంబసభ్యులతో కలిసి అనూష ఇంటికెళ్లి పుట్టింటి వారు చేయాల్సిన సపర్యలు చేశారు. అదేవిధంగా అశోక్ తన కూతురు ఇంటికి రాకపోకలు కొనసాగిస్తూ కూతురు బాగోగులు చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో తనకు వరకట్నం ఇవ్వాలని యాదగిరి తన మామ అశోక్‌ను డిమాండ్ చేశాడు. కూతురు అభ్యర్థన మేరకు కట్నంగా రూ.లక్ష ఇచ్చేందుకు అంగీకరించాడు. డబ్బుల విషయంలో తరచూ మామతో గొడవపడేవాడు. కాగా గతనెల 21వ తేదీన రూ.40వేలు ముట్టజెప్పాడు. చేతికి డబ్బులు రాకపోవటంతో మిగతా రూ.60వేలు ఇవ్వలేకపోయాడు. దీంతో యాదగిరి సోమవారం రాత్రి మద్యం సేవించి మామగారి ఇంటికి చేరుకుని, మామతో గొడవపడ్డాడు. ఈక్రమంలో కత్తెర తీసుకుని అశోక్ కడుపులో పొడిచాడు. తీవ్రగాయాలపాలైన అశోక్ కేకలు విని స్థానికులు వచ్చి అతన్ని కాపాడారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని అశోక్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పరిగి, సెప్టెంబరు 3: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని బీదర్ జిల్లా చిట్‌గప్ప మండలం ఏసునగర్ కాలనీకి చెందిన శివరాజ్(49) పరిగి మండలం సుల్తాన్‌నగర్‌లోని బంధువు ఇంటికి వచ్చారు. సోమవారం రాత్రి శివరాజ్‌కు అనారోగ్యంతో అస్వస్థతకు గురికాగా స్థానికులు పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చికిత్సలు నిర్వహించిన వైద్యులు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి కేసులో నలుగురి రిమాండ్



పోలీసుల అదుపులో నిందితులు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 3: అనుమానాస్పదస్థితిలో స్విమ్మింగ్‌పూల్‌లో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందిన కేసులో నలుగురు నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాదాపూర్‌లోని ఏస్ టెక్నాలజీ సంస్థ ఉద్యోగులు ఆదివారం రాత్రి ఘనాపూర్‌లోని ఓ ఫాంహౌస్‌లో తోటి ఉద్యోగి జన్మదిన వేడుకలు నిర్వహించగా అనుమానాస్పదస్థితిలో అజయ్‌తేజ స్విమ్మింగ్‌పూల్‌లో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు గచ్చిబౌలికి చెందిన రంజిత్‌కుమార్‌రెడ్డి, యూసుఫ్‌గూడకు చెందిన లోకిని సాయికుమార్, బాగ్‌లింగంపల్లికి చెందిన మంద శ్రీకాంత్‌లతో పాటు మేడిపల్లికి చెందిన ఫాంహౌస్ యజమాని మీర్యాల వెంకటేష్ అదుపులోకి తీసుకున్నారు. అజయ్‌తేజకు ఈతరాదని తెలిసి మద్యంమత్తులో తోటి ఉద్యోగులు రంజిత్‌కుమార్‌రెడ్డి, సాయికుమార్, శ్రీకాంత్‌లు స్విమ్మింగ్‌పూల్‌లోకి తోసినట్లు విచారణలో తేలింది. ఈ మేరకు ఫాంహౌస్ యజమానితో పాటు మరో ముగ్గురిని మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న 11 సెల్‌ఫోన్లు అప్పగింత

మూడుచింతలపల్లి, సెప్టెంబరు 3: వివిధ చోట్ల పలువురు పోగొట్టుకున్న 11 సెల్‌ఫోన్లను శామీర్‌పేట్ పోలీసులు రికవరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు టెక్నాలజీని ఉపయోగించి 11 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు మంగళవారం అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనాథ్ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ బాధితులు, సైబర్ క్రైమ్ కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ ఏడాది మొత్తం 19సెల్ ఫోన్లు పోయినట్లు ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 11 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు అప్పగించినట్లు వివరించారు. సెల్‌ఫోన్స్ పోగొట్టుకున్న వారు వెంటనే తమ ఆధార్‌కార్డుతో పాటు పూర్తి సమాచారాన్ని తీసుకువచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

సెల్‌ఫోన్, నగదు అపహరణ

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 3: సెల్‌ఫోన్, నగదును అపహరించుకెళ్లిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలోని కూరగాయాల మార్కెట్‌లో చోటు చేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ, లక్ష్మీనర్సింహాకాలనీకి చెందిన బి.కృష్ణ స్థానికంగా ఏర్పాటు చేసిన వారాంతపు సంతలో కూరగాయాలు కొనడానికి వచ్చాడు. గుర్తుతెలియని వ్యక్తి అతడి సెల్‌ఫోన్ కొట్టేసి ఫోన్‌పే ద్వారా అందులో నుంచి రూ.30వేల నగదును తన ఖాతాకు మళ్లించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ


మంబాపూర్‌లో రైతుల వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దేముల్, సెప్టెంబరు 3: ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. మంబాపూర్‌లో మంగళవారం రుణమాఫీపై వ్యవసాయ అధికారులు క్యాంపు ఏర్పాటుచేసి వివరాలు సేకరించారు. రుణమాఫీ కాని రైతులకు అవసరమైన సూచనలు చేశారు. బ్యాంకులు, సొసైటీల్లో వ్యవసాయ పంటరుణాలు కలిగి ఉండి రేషన్‌కార్డులేని రైతులవద్ద నుంచి వివరాలను సేకరించి నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇప్పటి వరకు 325 కుటుంబాల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. ఈకార్యక్రమంలో కోట్‌పల్లి మార్కెట్‌కమిటీ వైస్‌ఛైర్మన్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ యాలటి శ్రీనివాస్, ఏఈవో శ్వేత, షైపుస్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: రుణమాఫీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు పరిగి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాకురాలు డీకే లక్ష్మీకుమారి అన్నారు. బొంపల్లిలో మంగళవారం రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రభాకర్‌రావు, ఏఈవో బాబ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: రైతు రుణమాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు సేకరిస్తున్నారు. మండలంలోని పర్సాపూర్ గ్రామ రైతువేదికలో మంగళవారం పర్సాపూర్, హుసేన్‌పూర్, చిన్ననందిగామ, ప్యాలమద్ది గ్రామాలకు చెందిన రైతుల్లో రుణమాఫీ కాని వారి వివరాలను సేకరించారు. రేషన్‌కార్డులో పేరు లేని వారినుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శంకర్ రాథోడ్, ఏఈవో రాజు రాథోడ్, దేవేందర్, పావని పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీలో రుణమాఫీ కాని రైతుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. మండలంలోని మెట్లకుంటలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారి స్వాతి రైతుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ జయకృష్ణ పాల్గొన్నారు.

'పార్టీలో అవమానాలను భరించలేకే రాజీనామా'

ధారూరు, సెప్టెంబరు 3: పార్టీ కార్యక్రమాలకు పిలవకుండా తనను అవమానిస్తున్నారని, పార్టీలో తనకు జరుగుతున్న అవమానాలను భరించలేక మనస్తాపంతో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు నాగారం మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు ఎం.నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ధారూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీలో తనకు జరిగిన అవమానాలను వివరించారు. రెండు సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా విజయభాస్కర్‌రెడ్డి ఎన్నిక సమయంలో తనకు సమాచారం ఇవ్వలేదని చెప్పారు. ఈ విషయమై ప్రశ్నించినందుకు విజయభాస్కర్ రెడ్డి తన గ్రామంలో తనకు వ్యతిరేకంగా పార్టీలో ఒక గ్రూపును తయారుచేసి ప్రోత్సహించారని, తనకు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు మధ్య వ్యత్యాసం తెచ్చారని అన్నారు. ధారూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి తనకు ఇవ్వకూడదని విజయభాస్కర్‌రెడ్డి కొంత మంది నాయకులతో స్పీకర్‌ను కలిసి తనకు వ్యతిరేకంగా చెప్పారని ఆయన వివరించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షున్ని ఎన్నుకుంటున్న సమయంలోనూ తనకు సమాచారం ఇవ్వకుండ దూరం పెట్టారని తెలిపారు.